

సత్యదేవుని భక్తుల కోసం
నూతన క్యూలైన్ - 7లో

తలుపులమ్మ లోవలో భక్తుల సందడి

మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

మెట్టలో కర్రపెండలం నాట్లు



జీవం పోసుకున్న కర్రపెండలం నాట్లు

సామర్లకోట, జూలై 14: జిల్లాలోని మెట్టప్రాంతాల్లో అధికంగా వర్షం కురిసినట్లు మండల గణాంకాధికారుల లెక్కల ద్వారా తెలుస్తోంది. కొన్ని మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాలపై ప్రస్తుతం వరుణుడు కరుణించాడు. వరి, కర్రపెండలం, అపరాలు, మొక్కజొన్న తదితర పంటల సాగుకు ఈ వర్షాలు సరిపోతాయని రైతులు చెబుతున్నారు.

అన్ని పంటలకూ అనుకూలమే..

ప్రస్తుతం కురిసిన వర్షంతో అన్ని పంటల సాగు పనులకు అనుకూలమేనని రైతులు అంటున్నారు. గోదావరి జలాలు, ఏలేరు జలాల విడుదలతోపాటు కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటల సాగుకు ఎంతమాత్రం ఎదురుచూడక్కర్లేదని రైతులు చెబుతున్నారు. మెట్టప్రాంతాల్లోని పత్తిసాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే సాగు పూర్తయ్యిన వరి, కర్రపెండలం, తదితర కూరగాయల పంటలకు సమృద్ధిగా నీటితడులు వర్షాలతో అందాయని రైతులు ఆనందంతో చెబుతున్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు



జగ్గంపేటలో నాట్లు వేస్తున్న కూలీలు

- వరుస వర్షాలతో పరిస్థితులు అనుకూలం
- విత్తనాలు వేసేందుకు రైతులు సన్నద్ధం
- పంట కాలువలకు చేరుతున్న సాగునీరు

పిఠాపురం/జగ్గంపేట, జూలై 14: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వరుసగా పడుతున్న వర్షాలతో దుక్కుదున్నిన పొలాల్లో నీరు నిలిచింది. దీంతోమెట్టప్రాంతాలతోపాటు ఏలేరు, పీబీసీ ఆయకట్టులో విత్తనాలువేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కాల్వలకు స్వల్పంగా నీరు వస్తుండడంతో సాగుకు అనుకూలత ఏర్పడింది.

రైతులు సన్నద్ధం

బంగాళాఖాతంలో అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం, ఆపై రుతుపవనాల ప్రభావం కొనసాగుతోంది. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వారంరోజులకు పైగా ముసురు వాతావరణం నెలకొంది. ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచి ఉదయం 8గంటలవరకూ, ఆ తర్వాత ఏదొక సమయంలో వర్షం పడుతోంది. మరో రెండురోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతున్న నేపథ్యంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే దుక్కుదున్నిన పొలాల్లో విత్తనాలు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మిగిలిన ప్రాంతాల్లో దుక్కిదున్నడంలో నిమగ్నమయ్యారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు, దుర్గాడ, తాటిపర్తి, చెందుర్తి తదితర ప్రాంతాల్లో వర్షాధారంగా, బోర్లపై మెట్టప్రాంతాల్లో ముందుగానే వేసిన పంటలకు ఈ వర్షాలు జీవం పోశాయి. మెట్ట ప్రాంతంలోని జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని, కిర్లంపూడి మండలాల్లోను బోర్లు కింద వేసిన మెట్ట వరి, కాయగూరలు, పత్తిపొలాల్లో నీరు నిలిచింది. మిగిలిన చోట్ల పొలాలకు అవసరమైన తడి ఉన్న నేపథ్యంలో దుక్కుదున్ని మెట్టలో పత్తి, కాయగూరలు, మొక్కజొన్న తదితర పంటలు సిద్ధమవుతున్నారు. రైతులు వర్షాలు తగ్గగానే విత్తనున్నారు.

కాలువలకు స్వల్పంగా నీరు

ఏలేరు, పీబీసీ కాలువలకు స్వల్పంగా నీరు వచ్చింది. వంతులవారీ విధానంలో ఏలేరుకు సాగునీరు విడుదల చేస్తామని ప్రకటించడం, పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను ఏలేరు కాలువలకు చేరుతున్న నేపథ్యంలో వరి నారుమడులు వేయడం ఊపందుకుంది. ఏలేరు, పీబీసీ కాలువల్లో ఉన్న గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో అత్యవసర పనులకు రూ.51లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులకు అత్యవసర ప్రాతిపదికన చేపడుతున్నారు. ఏలేరు నీరు విడుదలకు వంతుల వారీ విధానంలో సమయం ఉన్న నేపథ్యంలో ముందుగా ఏలేరు కాలువల్లో పూడిక తొలగింపు పనులు వేగంగా జరుగుతున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో రైతులు ఈసారి సన్నరకం సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. గత ఖరీఫ్, దాళ్వా సీజన్లలో సన్నరకాలకు మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో సన్నరకాల వరివిత్తనాలకోసం రైతులు ఎక్కువగా అడుగుతున్నట్లు విత్తన డీలర్లు చెబుతున్నారు. ఇదే రీతిలో వర్షాలు కొనసాగితే పంటలు సాగు మరింతగా ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి.

ఇతర ప్రాంతాలనుంచి నారు తెచ్చుకునేందుకు..

ఏలేరు, పీబీసీ కాలువలకు సాగునీరు విడుదల ఆలస్యమైన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో రైతులు నేరుగా వరినాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందుకుగాను ఇతర ప్రాంతాలనుంచి వరినారును కొనుగోలు చేసి తెచ్చి నాట్లు వేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులకు విక్రయించేందుకు వీలుగా నారు పెంచే విధానాన్ని అవలంబిస్తున్నారు. అక్కడినుంచి నారు తెచ్చుకుని నాట్లు పూర్తి చేసుకుంటే పంటసాగు ఆలస్యం కాకుండా ఉంటుందని రైతులు చెబుతున్నారు. వెదజల్లు విధానంలో సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. గతం కంటే అధికంగా ఈసారి ఈ పద్ధతి వరిసాగు చేస్తారని భావిస్తున్నారు.



గొల్లప్రోలులో దుక్కు దున్నిన పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

సదరమ్ సక్రమమేనా?



- దివ్యాంగుల పింఛన్లలో అనర్హులకు అందలం
- దివ్యాంగత్వం సర్టిఫికెట్ల కేటాయింపులో మాయాజాలం
- వైసీపీ హయాంలో పలుచోట్ల అక్రమాలు
- మధ్యవర్తుల ద్వారా వైద్యులకు ముడుపులతో పని

కోటనందూరు/తుని రూరల్, జూలై 14: వైసీపీ పాలనలో పింఛన్‌దారుల ఎంపికలో భారీ అక్రమాలు చోటుచేసుకొంటున్నాయి. వైకల్యం లేకపోయినా, ఎక్కువ భూములు ఉన్నా వయసు తక్కువగా ఉన్న పింఛన్లకు ఎంపిక చేశారన్న విమర్శలున్నాయి. అర్హత లేకపోయినా వైసీపీ సానుభూతి పరుడైతే చాలు పింఛన్‌కు అర్హుడే అన్న చందంగా వ్యవరించారు. చాలామంది అనర్హులు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి పింఛన్లు అందుకుంటున్నారు. దీనిపై టీడీపీ ఫిర్యాదు చేసినా అధికారులు సరిగా స్పందించడంలేదు. ప్రభుత్వం మారడంతో నాటి అరాచకాలన్నీ ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. జిల్లాలో కోట్ల రూపాయిలు ప్రభుత్వ ధనం పింఛన్ల రూపంలో అనర్హుల చేతిలోకి వెళ్తున్నాయి.

అధికారుల విచారణతో వెలుగులోకి..

కోటనందూరు మండలంలోని కొత్తకొట్టాం, ఎల్‌డీపేట గ్రామాల్లో పింఛన్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఇటీవల జిల్లా అధికారులు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టారు. దీంతో కొన్నిచోట్ల అనర్హులకు పింఛన్లు అందుతున్నట్టు అర్థమవుతోంది. జిల్లాలో వేల సంఖ్యలో బోగస్ పింఛన్లు అందుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. నకిలీ ధ్రువపత్రాలతో చాలామంది పింఛన్లు పొందుతున్నారు. ఇందులోభాగంగా దివ్యాంగులకు బోగస్ ధ్రువపత్రాలు విచ్చలవిడిగా మంజూరవుతున్నాయి. దీనికి జిల్లా కేంద్రంగా ఒక ముఠా నడుస్తోంది. వివిధ మండలాల నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రికి లేదా జిల్లాలో సదరం శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ల వద్దకు ఆ ముఠా వాలిపోతోంది. ఆపై వైద్యుల వద్దకు సదరం ధ్రువ పత్రంకోసం వచ్చే అభ్యర్థి నుంచి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేసి కథ నడిపిస్తున్నారు. ఆ విధంగా జిల్లావ్యాప్తంగా బోగస్ పింఛన్లు గత ఐదేళ్లలో పుట్టగొడుగుల్లా పెరిగిపోయాయి. భూములు ఎక్కువగా ఉన్నా కొంతమంది పింఛన్లు పొందుతున్నారు. ఒక రేషన్ కార్డుపై ఒక పింఛన్ మాత్రమే అర్హత ఉంది. కానీ ఒకే ఇంట్లో ఇద్దరు చొప్పున పింఛన్లు పొందుతున్నవారు జిల్లాలో చాలామంది ఉన్నారు. కొందరికి ఎటువంటి దీర్ఘకాలిక వ్యాధులు లేకపోయినా బోగస్ సర్టిఫికెట్లతో వేల రూపాయిలు పింఛన్లు పొందుతున్నారు. కొంతమంది మహిళలు తమ భర్తకు దూరంగా ఉంటున్నారు. వారిలో కొందరు భర్త లేడని తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి వితంతు పింఛన్లు అందుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో భారీఎత్తున బోగస్ పింఛన్లు మంజూరయ్యాయి. జిల్లాలో మొత్తం 2.79 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నారు. ఇందులో వృద్ధాప్యం కింద 1.37లక్షలు, వితంతువులు 73,548మంది, వికలాంగులు 35489మంది, ఒంటరి మహిళలు 7898మంది పింఛన్లు అందుకుంటున్నారు. అక్రమంగా పింఛన్లు అందుకొంటున్నవారిపై ఈ కొత్త ప్రభుత్వంలో చర్యలు తీసుకొని అర్హులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తునిలో వైసీపీ నేతలకే సదరం

వైసీపీ ప్రభుత్వ హయాంలో తునిలో సదరం సర్టిఫికెట్లు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైకల్యం కారణంగా ఏ పనిచేసుకోని వారికి ప్రభుత్వం సదరమ్ సర్టిఫికెట్లు జారీ చేసింది. ప్రభుత్వ వైద్యులు పరిక్షించి దివ్యాంగులకు సర్టిఫికెట్లు జారీ చేస్తారు. సాధారణంగా 40శాతానికి మించి వైకల్యం ఉంటే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారు. తునిలో ఈ ప్రక్రియను అప్పటి మంత్రి అనుచరులు పూర్తిగా దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. సదరమ్ సర్టిఫికెట్లు అధికంగా వైసీపీ సానుభూతి పరులకే దక్కాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పటి మంత్రిమండల స్థాయి నాయకులకు కుడి భుజాలుగా ఉన్నగ్రామస్థాయి నాయకులు, వారి కుటుంబసభ్యులకే సదరం సర్టిఫికెట్లలో లబ్ధి పొందారని ప్రతిచోట చర్చ నడుస్తోంది. చాలాచోట్ల వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వార్డు కౌన్సిల్ మెంబర్లు, వారిబంధువులు, వారి అనుచరులు సదరమ్ సర్టిఫికెట్లు కాజేసినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ స్లాట్‌బుక్ చేసుకోవడం, అప్పట్లో సదరమ్ సర్టిఫికెట్ మాఫియాకు రూ.10వేలు ఇస్తే పని పూర్తయ్యేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అవాక్కైన కూటమి నాయకులు

పెంచిన పింఛన్లు అమలు చేసిన కూటమి ప్రభుత్వం వాటి పంపిణీని కూటమి నాయకులతో పంపిణీ చేపట్టే కార్యక్రమంలో పింఛన్ లబ్ధిదారులను చూసి కూటమి నాయకులు అవాక్కయినట్లు తెలిపారు. హంసవరంలోని చేపూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అర్హత లేకుండానే దివ్యాంగుల పింఛన్ తీసుకుంటున్నాడని సమాచారం. అతడికి ఎటువంటి వైకల్యం లేకపోయినా వైసీపీ సానుభూతిపరుడు కావడంతో సదరం సర్టిఫికెట్ ఇచ్చి పింఛన్ మంజూరు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రతిరోజూ తుని ఎమ్మెల్యే వద్దకు పింఛన్ దరఖాస్తులు వస్తున్నాయి. వాటిలో చాలామటుకు దివ్యాంగుల పింఛన్ కోసం అర్హులైన వారే అత్యధికులుగా ఉంటున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

- పెద్దాపురంలో నియోజకవర్గ గ్రీవెన్స్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 14: జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌హాల్‌లో సోమవారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి పెద్దాపురంలోని మట్టేవారి కళ్యాణ మండపంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి పెద్దాపురం నియోజకవర్గం పరిసర ప్రాంతాల ప్రజలనుంచి వినతులను స్వీకరిస్తామన్నారు. నియోజకవర్గ స్థాయి అధికారులు పెద్దాపురం మట్టేవారి కళ్యాణ మండపంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలన్నారు.


భారీ కొండచిలువ హతం - 7లో

పోటెత్తుతున్న వరదనీరు - 7లో

ఆలోచింపజేసిన నాటికలు - 7లో

నేటినుంచి అన్నవరం రైల్వేగేటు మూసివేత - 7లో

కోతుల బెడదతో.. భయాందోళన



ప్రత్తిపాడులో ఇంటి పైకప్పులపై కోతుల వీర విహారం

- వానర మూకల దాడులతో భయాందోళనలో ప్రజలు

ప్రత్తిపాడు, జూలై 14: ప్రత్తిపాడులో కోతుల బెడద తీవ్ర రూపం దాల్చింది. గ్రామంలో మూకుమ్మడిగా వానర మూక చేస్తున్న దాడులకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున వానర మూక గ్రామంలో చొరబడి మహిళలు, చిన్నపిల్లలపై ఆహార పదార్థాల కోసం దాడులకు పాల్పడుతున్నాయి. ప్రత్తిపాడులోని తోట వీధి, బ్యాంకువీధి, ఇందిరాకాలనీల్లో వానరమూక తరుచూ ఇళ్లపై కప్పులపై, వంట గదుల్లోకి చొరబడి సామాగ్రిని చిందర, వందర చేస్తున్నాయి. దీంతో ఒంటరిగా ఉన్న మహిళలు, చిన్నపిల్లలపై కోతులు దాడులకు దిగి గాయపరుస్తున్నాయి. నాలుగు రోజుల కింద కోతుల దాడికి ఒక మహిళ భయాందోళనకు గురై కిందకు దూకడంతో ఆమె తీవ్రంగా గాయపడి కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి ఈ విధంగా ఉండడంతో గ్రామంలోని ప్రజలు కోతుల మూక వస్తుంటే భయాందోళనతో పరుగులు తీస్తున్నారు. వీధుల్లో యథేచ్ఛగా తిరగడం, ఆహార పదార్థాల సామాగ్రి సంచులతో వెళ్తున్న వారి నుంచి సంచులు లాక్కుని గాయపరుస్తున్నాయి. గ్రామంలో వీటి దాడి వల్ల జరుగుతున్న ఇబ్బందులను స్థానికులు సర్పంచ్ గుడాల విజయ లక్ష్మివెంకటరత్నం, కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా కోతుల బెడద నివారణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపట్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీప యర్రవరంలో పంచాయతీ అధికారులు వందలాది కోతులను పట్టుకుని వాటిని బంధించి అటవీప్రాంతంలో వదిలిపెట్టిన విధంగా స్థానిక అధికారులు కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి విముక్తి కలిగించాలని స్థానికులు విజ్ఞప్తిచేస్తున్నారు.

● కోతుల దాడులు ఎక్కువయ్యాయి
-బళ్ల మోహన్, ప్రత్తిపాడు

ప్రత్తిపాడులో కోతుల దాడులు ఎక్కువయ్యాయి. ఆహార పదార్థాలకోసం కోతులు,మహిళలు,చిన్నపిల్లలపై దాడి చేస్తున్నాయి. కోతుల దాడి కారణంగా ఇందిరాకాలనీకి చెందిన మహిళ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అధికారులు కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలి.

అక్కరకు రాని ఆర్బీకేలు



- వైసీపీ హయాంలో భవనాలు నిర్వీర్యం
- పనికి రాని రూ.కోట్ల విలువైన పరికరాలు
- రూ.40కోట్లు వెచ్చించి నిర్మాణాలు
- సిబ్బంది జీతాలు అదనం

సామర్లకోట, జూలై 14: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే) అక్కరకు రాకుండా పోయాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు అలంకారప్రాయంగా మిగులుతున్నాయి. కేంద్రంలోని అధిక ధరలు కలిగిన పరికరాలు ఉపయోగకరం కానివిగా మూలనపడుతున్నాయి. అధికసేవలంటూ రైతులకు సహకరించకపోగా కొత్త నిబంధనలతో రైతుల్లో గందరగోళానికి గురయ్యేలా చేసింది.

ఆదిలో అద్దె భవనాల్లో..

జిల్లాలో క్లస్టర్ల వారీగా రైతు భరోసా కేంద్రాలను ఆదిలో అద్దె భవనాల్లో ఏర్పాటు చేసినా రైతులకు వాటి ద్వారా సాగులో సహకారం అందేలా చేయడంలో ప్రాధాన్యం ఇవ్వలేదు. భవనాల నిర్మాణం వాటిలో పనిముట్లు ఏర్పాటుపైనే దృష్టి సారించారు. దీంతో ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో ఒక్కో ఆర్బీకే కేంద్రానికి రూ.21లక్షల50వేలతో భవనాన్ని నిర్మించారు. జిల్లాలో 413రైతు భరోసా కేంద్రాల్లో అన్నింటికీ సొంత భవనాలు లేవు. దీంతో సొంత భవనాలు నిర్మించేందుకు ఎన్ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ.40కోట్ల నిధులు కేటాయింపులు జరిపి నిర్మించారు. కొన్ని భవనాలు నిర్మాణాల్లోనే ఉన్నాయి. ఆర్‌బీకేలతో రైతులకు అదనంగా ఒరిగేదేమీ లేదని పలువురు రైతులు ఇప్పటికే విమర్శలు చేస్తున్నారు. దీనికితోడు ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌లు, ఎల్‌ఈడీ టీవీలు తదితర ఎలక్ట్రికల్ పనిముట్లు ఏర్పాటు చేశారు. ఒక కియోస్క్‌కే రూ.70వేల వరకూ వెచ్చించి ఏర్పాటు చేశారు. వాటిలో రైతులు ఎరువుల వివరాలు, ఇతర వివరాలను తెలుసుకోవచ్చని ఆర్భాటపు ప్రచారం చేశారు. మొత్తంమీద ఆ పరికరాలకు రూ.2.89కోట్ల పైనే ఉంటుందని అధికారులు తెలిపారు. ఒక ఎరువుల విక్రయాలు తప్ప, అదీ కొన్నిరకాల ఎరువులు ఇచ్చే కేంద్రాలుగా నిలిచాయి. రైతులను ఆకట్టుకోలేదు. అధికశాతం ఆర్బీకేలకు ఇంటర్‌నెట్ సదుపాయం లేకపోవడం, ఇంటర్‌నెట్ సదుపాయం ఉన్నా సకాలంలో బిల్లులు చెల్లించలేకపోవడం వంటి కారణాలతో కియోస్క్‌లకు పనిలేకుండా మూలన చేరాయన్న ఆరోపణలున్నాయి. ఇంకా ఆర్‌బీకేలకు విద్యుత్ బిల్లులు, సిబ్బంది జీతాలు ప్రభుత్వానికి భారం తప్ప రైతులకు నిరుపయోగమేనని రైతులు అంటున్నారు. ఆర్బీకేల్లో నియమించిన వీఏఏలు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాలకే పరిమితం అవుతూ ఆర్బీకేల్లో రైతులకు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలున్నాయి. మేజర్ పంచాయతీఅయిన వేట్లపాలెంలో నాలుగు ఆర్బీకేలు ఏర్పాటు చేసి నలుగురు సిబ్బందిని నియమించినా వాటిలో ఇద్దరు మాత్రమే పనిచేస్తుండగా మరో ఇద్దరు లేకపోవడంతో సదరు రెండు రైతుభరోసా కేంద్రాలను మూసివేశారు. దీంతో ఇక్కడ ఏర్పాటుచేసిన సిబ్బంది ఒకరికి డిప్యూటేషన్‌పై సామర్లకోట వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలోకి మార్చిన ప్పటికీ తనకు గల పలుకుబడితో ఎక్కడకూ వెళ్లకుండా కాల క్షేపం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సదరు సిబ్బంది చేయాల్సిన పనులను వీఏఏలకు అప్పగిస్తున్నప్పటికీ పైస్థాయి అధికారులు సైతం నోరుమెదపలేకపోతున్నట్లు సమాచారం.

పరికరాలు మూలనపడ్డాయి

ఆర్‌బీకేల్లో వేల రూపాయలతో టెక్నాలజీ కలిగిన ఎలక్ట్రికల్ కియోస్క్ పరికరం పెట్టాం. పశువులకు సంబంధించిన దాణా, వ్యవసాయానికి కావాల్సిన ఎరువులు, రైతు భరోసా పథకం వివరాలు తెలుసుకోవడం వంటివి చూడవచ్చని ఏర్పాటు చేశామన్నారు. రైతుకు వాటిని ఉపయోగించే విధానం తెలియదు. అవగాహన కల్పించలేదు. క్షేత్రస్థాయి అవగాహన సదస్సులు పూర్తిగా ఎత్తివేశారు. ఇక ఆర్బీకేల్లోనైనా రైతులకు అవగాహన ఏర్పరుస్తారంటే అదీలేదు. చివరికి కియోస్క్‌లు, ఎల్‌ఈడీ టీవీలు మూలన చేరాయి. విద్యుత్‌బిల్లుల భారం వ్యవసాయాధికారులపై పడింది. స్తోమత ఉన్నవారు విద్యుత్ బిల్లులు తమ సొంత సొమ్ములు వెచ్చించి చెల్లిస్తుండగా అవి తిరిగి వచ్చేనా అని ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రభుత్వం మారడంతో సహజంగానే బదిలీలు వస్తాయి. వాటిలో స్థానచలనం అయితే ఇప్పటివరకూ తమ సొంత సొమ్ములు విద్యుత్ బిల్లులుగా చెల్లించిన సొమ్ములు తిరిగి వస్తాయా, కొత్త ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందా అని వ్యవసాయాధికారులు బెంబేలెత్తుతున్నారు.

కాలువల అభివృద్ధికి సొమ్ములు లేవు

జిల్లాలో వైసీపీ ప్రభుత్వం ఆర్‌బీకేల ఏర్పాటుకు, భవనాలు, పరికరాలు కింద రూ.60కోట్లు వెచ్చించింది. దీనికి సిబ్బంది జీతాలు అదనం. కాలువల అభివృద్ధికి ఏడాదికి రూ.25కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.125కోట్ల వరకూ ఖర్చు పెట్టాల్సింది ఉంది. కానీ ఈ ఐదేళ్లలో రూ.20 కోట్లకు మించి ఖర్చు పెట్టలేదు. ఇదే రైతుల పాలిట శాపంగా మారింది.

జగన్ పాలనలో ఐటీడీఏల నిర్వీర్యం

మూడేళ్లుగా పాలకమండలి ఆమోదాలు లేకుండానే ఆర్థిక లావాదేవీలు

రంప, పాడేరు, చింతూరు ఐటీడీఏలలో రూ.పదుల కోట్లలో నిధుల ఖర్చు


రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం

(రంపచోడవరం): జగన్ పాలనలో అల్లూరి జిల్లాలోని కలెక్టర్ అధ్యక్షతన నడిచే రంపచోడవరం, చింతూరు, పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)లు నిర్వీర్యమయ్యాయి. గత మూడేళ్లుగా ఒక్కసారి కూడా పాలకమండలిని సమావేశపర్చకుండా మూడు ఐటీడీఏలకు చట్టబద్ధత లేకుండా చేశారు. పాలకమండలి ఆమోదాలు లేకుండానే ఈ మూడు ఐటీడీఏల్లో ఆర్థిక లావాదేవీలు చట్టవిరుద్ధంగా ప్రహసనంగా సాగిపోయాయి. ప్రభుత్వ శాఖగా కాకుండా స్వయం ప్రతిపత్తి సొసైటీలుగా ఏర్పాటైన ఐటీడీఏలు సొసైటీల చట్టం కింద రూపొందించుకున్న నియమావళి మేరకే నడవాల్సి ఉంది. జిల్లా కలెక్టరు అధ్యక్షుడిగానూ, పార్లమెంటు సభ్యుడు శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు, స్థానిక సంస్థల మండల ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు సభ్యులుగా కనీసం ప్రతి మూడు నెలలకు ఒకసారి పాలకమండలి సమావేశమై ఎప్పటికప్పుడు కార్యాచరణ ప్రణాళికలను నిర్దేశించుకుంటూ ఆ మేరకు మాత్రమే కార్యకలాపాలను, ఆర్థిక లావాదేవీలను ఈ ఐటీడీఏ సొసైటీల్లో నిర్వహించాలి. ఏడాదికి ఒక వార్షిక సమావేశాన్ని కూడా నిర్వహించని దుస్థితిలో రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏలలో ఒక్కసారి కూడా పాలకమండలి ఆమోదం తీసుకోకుండానే అధికారులు ఇష్టారాజ్యంగా పదుల సంఖ్యలో కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేశారు.. ఈ ప్రకారం ఈ ఐటీడీఏలు నిర్వీర్యమై చట్టబద్ధతను కోల్పోయాయి. నిబంధనల ప్రకారం ఐటీడీఏల ద్వారా అమలయ్యే ఏ కార్యకలాపమైనా పాలకమండలి ఆమోదంతోనే జరగాలి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల రాబడి, చేపట్టే కార్యక్రమాలు, ప్రణాళికలు, వ్యయాలు తదితర అంశాలన్నింటినీ పాలకమండలి ఆమోదించాల్సిందే! కానీ గత మూడేళ్లుగా ఈ ఐటీడీఏలలో పాలకమండలి ఆమోదం లేకుండానే కోట్లాది రూపాయలతో కార్యకలాపాలు సాగాయి. రాష్ట్రంలో ఎక్కడా కూడా గడిచిన 48 సంవత్సరాలలో ఒక్క కోవిడ్ కాలంలో మినహా ఐటీడీఏల్లో పాలకమండలి సమావేశం లేని సంవత్సరమంటూ లేదు. 2019 డిసెంబరు తర్వాత రంపచోడవరం, 2021 సంవత్సరం డిసెంబరు, 28 తర్వాత చింతూరు ఐటీడీఏ, 2022 ఏప్రిల్ తర్వాత పాడేరు ఐటీడీఏల్లో పాలకమండళ్లు లేకుండానే కార్యక్రమాలన్నీ జరిగిపోయాయి. తద్వారా ఈ ఐటీడీఏల్లో అధికారులు సాగించిన కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీలకు చట్టబద్ధత లోపించింది. అంతేకాకుండా కోట్లాది రూపాయల నిధులను కూడా పాలకమండలి ఆమోదం లేకుండానే అప్పటి ప్రభుత్వ అవసరాలకు మళ్లించేశారు. సొసైటీ చట్ట నిబంధనల ప్రకారం ఇంతవరకూ సాగిన కార్యక్రమాలకు చట్టబద్ధత లేనట్టేనా అన్న ప్రశ్నలు సర్వత్రా ఉత్పన్నమవుతున్న తరుణంలో గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసి ఇప్పుడు అల్లూరి జిల్లా కలెక్టరుగా వచ్చిన దినేష్‌కుమార్ ఈ మూడు ఐటీడీఏలను అధ్యక్షుడిగా ఎలా నిర్వహిస్తారో వేచి చూడాలి..



సత్యదేవుని భక్తుల కోసం నూతన క్యూలైన్

అన్నవరం, జూలై 14: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో రూ. 300 వ్రతం ఆచరించుకునే భక్తులకు వ్రతం అనంతరం స్వామివారి దర్శనానికి వెళ్లేందుకు ప్రత్యేక క్యూలైన్‌లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వ్రతం అనంతరం భక్తులు దర్శనం కోసం ఎండ, వానలలో బాధపడుతూ దర్శనానికి చేరుకునేవారు. అంతేగాకుండా శని, ఆదివారాల్లో స్వామివారి ప్రాకారసేవ, రథోత్సవం సందర్భంగా బయటనడిచే భక్తులతో ఇబ్బందులు ఎదురయ్యేవి. అయితే రూ.300 వ్రత మండపం ఎదురుగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రత్యేక క్యూలైన్ వద్ద టీటీడీ మాదిరి కూర్చొనేందుకు బల్లలు, ఫ్యాన్లు, తాగునీరు సదుపాయం కల్పించారు. గతేడాది కార్తీకమాసంలో అప్పటి ఈవో ఆజాద్ కంపార్ట్‌మెంట్ మాదిరి ఏర్పాటుచేయగా గాలి, వెలుతురు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కోవడంతో ప్రస్తుత ఈవో దీనిని గమనించి కంపార్ట్‌మెంట్‌లను పూర్తిగా తొలగించి ఆ ప్రదేశంలో నూతన క్యూలైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరో 10 రోజుల్లో పనులు పూర్తవుతాయని శ్రావణమాసం రద్దీ నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని ఈవో రామచంద్రమోహన్ తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం



మోతుగూడెం,జూలై14: చింతూరు మండలం మోతుగూడెం మూడు రోజుల కింద విహారయాత్రకు వచ్చి ఫోర్‌బై రిజర్వాయర్‌లో కాలు జారిపడి గల్లంతైన అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరుకు చెందిన వీరి మురళీకృష్ణ(24) మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఉదయం 10గంటలకు పోలీసులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు బెల్కొంతు డాం దగ్గర మృతదేహం లభించింది. మృతదేహాన్ని చింతూరు గవర్నమెంట్ హాస్పటల్‌కి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు, హెడ్ కానిస్టేబుల్ రాజు సన్నీ పాల్గొన్నారు.

చింతలూరులో విషాదఛాయలు



ఆలమూరు, జూలై 14: మోతుగూడెం వాటర్ ఫాల్స్ వద్ద గల్లంతైన యువకుడు ఆదివారం విగతజీవిగా తేలడంతో ఆలమూరు మండలం చింతలూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం చింతలూరు నుంచి పది మంది యువకులు మోతుగుడెం వద్ద వాటర్‌ఫాల్స్ దగ్గరకు వెళ్లారు. వీర మురళీకృష్ణ అనే యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి గల్లంతయ్యాడు. రెండు రోజులుగా గాలించగా ఆదివారం మృతదేహం లభ్యమైంది. దీంతో చింతలూరులోని మృతుడు మురళీకృష్ణ ఇంటి వద్దకు అతడి బంధువులు, మిత్రులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు.

సోకులేరు వాగులో పడి యువకుడి గల్లంతు



మోతుగూడెం, జూలై 14: విహార యాత్రకు వెళ్లిన ఓ యువకుడు సోకులేరు వాగులో పడి గల్లంతయ్యాడు. ఎస్ఐ జి. గోపాలరావు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయవాడ గుణదలకు చెందిన ఏడుగురు బీటెక్ విద్యార్థులు కారులో ఆదివారం చింతూరు మండలం చదలవాడ పంచాయతీ సోకిలేరు వ్యూ పాయింట్ దగ్గరకు విహారయాత్రకు వచ్చారు. వీరిలో ఇద్దరు అల్లూరి తేజ (24), అవినాష్ వ్యూ పాయింట్ దగ్గర ఉన్న సోకులేరువాగులో దిగి స్నానాలు చేస్తుండగా అల్లూరి తేజ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. తేజను రక్షించడానికి వెళ్లిన అవినాష్ సైతం నీటి ప్రవాహంలో కొట్టుకుపోతూ ఉంటే తోటి స్నేహితులు రక్షించండి అంటూ చేస్తున్న ఆర్తనాదాలు విని స్థానికులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని అవినాష్‌ను సురక్షితంగా బయటకు లాక్కొచ్చారు. పోలీసులు, స్నేహితులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టినా తేజ ఆచూకీ లభించలేదు. దీంతో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టెంబరు 28, 29 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 14: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (మంగళగిరి) ఆధ్వర్యంలో సెప్టెంబరు 28, 29 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు గోదావరి ట్విన్ ఆర్ట్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి డీఎంవీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇంగ్లీషు, తెలుగు భాషల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్ హైస్పీడ్ పరీక్షలను, ఇంగ్లీష్‌లో జూనియర్ గ్రేడ్ పరీక్ష, హిందీలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా 35 కేంద్రాల్లో నిర్వహిస్తారన్నారు. అలాగే తెలుగు, ఇంగ్లీషు షార్ట్ హ్యాండ్ పరీక్షలను సెప్టెంబరు 21, 22 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 6 కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. విజయవాడ షార్ట్ హ్యాండ్ కేంద్రం రద్దు చేసి, గుంటూరులో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరీక్షలకు ఇంకా 75 రోజుల సమయం ఉన్నందున వెంటనే స్థానికంగా ఉన్న టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈనెల 31 లోగా సంప్రదించి సకాలంలో పరీక్ష ఫీజులు చెల్లించాలని కోరారు.

భారీగా తాబేళ్లు స్వాధీనం

మోతుగూడెం,జూలై14:చింతూరు మండలం మీదుగా అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను అటవీ శాఖాధికారులు పట్టుకున్నారు. చింతూరు మండలం తులసిపాక అటవీ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగాతరలిస్తున్న తాబేళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 246 తాబేళ్లను కాకినాడ నుంచి ఏజెన్సీ మీదుగా ఒడిశాకు తరలిస్తున్న ఒడిశాకు చెందిన సూరజ్ మండల్‌ను అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వాహనంలో 246 తాబేళ్లలో 230 తాబేళ్లు సజీవంగా ఉన్నాయని 16 తాబేళ్లు మృతి చెందాయని పట్టుబడ్డ తాబేళ్లను శబరి నదిలో వదిలిపెడతామని లక్కవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి నానాజీ తెలిపారు. సూరజ్‌మండల్‌ను అదుపులోకి తీసుకున్నామని ఆయనపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని ఈ తనిఖీల్లో లక్కవరం సెక్షన్ ఆఫీసర్ విజయ్‌కుమార్, లక్కవరం బీట్ ఆఫీసర్ బి.సరిత, చెక్‌పోస్టు సిబ్బంది ఉన్నారు.

పట్టుబడిన యానాం మద్యం



తాళ్లరేవు, జూలై 14: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ మద్యాన్ని బోటుపై తరలిస్తుండగా గోవలంక ఇసుక ర్యాంపు వద్ద కోరింగ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... కాట్రేనికోన మండలం బలుసుతిప్ప గ్రామానికి చెందిన మద్యం వ్యాపారి దండుప్రోలు సతీష్ యానాం నుంచి 13 ప్లాస్టిక్ సంచుల్లో 2,340 లిక్కర్ బాటిల్స్‌ను అక్రమంగా తరలిస్తూ గోవలంక రేవు వద్ద బోటుపై తరలించేందుకు సిద్ధంగా ఉండగా పోలీసులకు వచ్చిన సమాచారం ప్రకారం కోరింగ ఎస్ఐ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. మద్యం బస్తాలను స్వాధీనం చేసుకుని బోటును సీజ్ చేశారు. దండుప్రోలు సతీష్‌పై కేసు నమోదు చేసి కాకినాడ స్పెషల్ కోర్టుకు తరలించనున్నట్లు కోరింగ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ చిట్టిబాబు, పీసీలు సురేష్, చంద్ర, వీఆర్వో, వీఆర్ఏలు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎస్ఐ మృతి

గొల్లప్రోలు, జూలై 14: కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న కృష్ణారావు (59) ఆదివారం గుండెపోటుతో మరణించారు. కాకినాడలోని ఇంటి వద్ద ఉండగా ఆయనకు గుండెపోటు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏడాది కాలంగా ఆయన గొల్లప్రోలులో విధులు నిర్వర్తిస్తున్నారు. ఏఎస్ఐ మృతికి పలువురు పోలీసు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

గండిపోశమ్మకు పూజలు

దేవీపట్నం, జూలై14: మండల పరిధిలో వేంచేసియున్న ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి సంబంధించి టిక్కెట్లు తదితర వాటికి కలిపి రూ.19,700 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

తలుపులమ్మ లోవలో భక్తుల సందడి


లోవకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు



తుని రూరల్, జూలై 14: తలుపులమ్మ లోవ క్షేత్రం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. ఆషాఢ ఆదివారం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తుల రాకతో లోవ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అమ్మవారికి ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోను, కాటేజీల్లోను వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే కుంకుమార్చనల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పోలీసు యంత్రాంగం రద్దీని నియంత్రించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ఈవో విశ్వనాథరాజు మాట్లాడుతూ లోవ క్షేత్రానికి 2వ ఆదివారం 40 వేల మందికి పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకోగా క్షేత్ర పరిసరాలకు లక్షకు పైగా భక్తులు వచ్చారన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా 100 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారన్నారు. వివిధ విభాగాల నుంచి రూ.11.95 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గత ఏడాది ఆషాఢ మాసం 2వ ఆదివారంతో పోల్చితే ఈ ఏడాది రూ.92 వేలు అధికంగా ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


క్యూలో నిల్చున్న భక్తులు



పెద్దాపురం, జూలై 14 : భక్తుల కొంగు బంగారం మరిడమ్మ జాతరకు రెండో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం పలు ఏర్పాట్లు చేశారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.


స్వామివారి ప్రసాదం అందిస్తున్న అధికారులు

సమాచార కమిషనర్ పూజలు

అన్నవరం, జూలై 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా పీఆర్వో స్వామివారి ప్రసాదం అందజేశారు.


క్యూలో నిల్చున్న భక్తులు

సత్యదేవుడి ప్రసాదం కోసం..

అన్నవరం, జూలై 14: సత్యదేవుడి సన్నిధిలో అమృతతుల్యంగా భావించే స్వామివారి గోధుమరవ్వ ప్రసాదం కొనుగోలుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. తలుపులమ్మ లోవ అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో తమ స్వస్థలాలకు వెళ్లే భక్తులు జాతీయ రహదారిపై నమూనాలయం వద్ద ప్రసాదం కొనుగోలుకు బారులు తీరారు. కొండపైన, కొండి దిగువన తొలిపావంచా, బైపాస్‌లో రెండు నమూనాలయాల వద్ద కలిపి సుమారు 90 వేల ప్రసాదం ప్యాకెట్లను విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఏటూరునాగారం శివారులో ఘోర ప్రమాదం

కంటైనర్ లారీని ఢీకొన్న ఆటో

తొండంగి మండలం కోదాడకు చెందిన మహిళతో పాటు

ఆమె తల్లిదండ్రులు, డ్రైవర్ దుర్మరణం


సత్యనారాయణరాజు, సత్యవతి మృతదేహాల వద్ద రోదనలు


అనిత (ఫైల్‌ఫొటో)

వాజేడు, జూలై 14: ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరునాగారం శివారులో శనివారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో తొండంగి మండలం కోదాడకు చెందిన మహిళతో పాటు ఆమె తల్లిదండ్రులు, ఆటో డ్రైవర్ మృతిచెందారు. దీంతో ఏటూరునాగారం సమీప గ్రామం వాజేడులోను, కోదాడలోను విషాదఛాయలు అలుముకున్నాయి. తొండంగి మండలం కోదాడ గ్రామానికి చెందిన తమ కూతురు సాగి అనితను వాజేడు మండల కేంద్రానికి చెందిన కాకర్లపూడి సత్యనారాయణరాజు, సత్యవతి దంపతులు బస్సు ఎక్కించేందుకు శనివారం రాత్రి బయల్దేరారు. నాగరాజు అనే డ్రైవర్ ఆటోను కిరాయికి మాట్లాడుకున్నారు. సత్యనారాయణరాజు, సత్యవతి, అనిత ఆటో ఎక్కగా డ్రైవర్ నాగరాజు అదే గ్రామానికి చెందిన యువకుడు అంజిరెడ్డిని తోడుగా తీసుకెళ్లాడు. డ్రైవర్ సహా నలుగురు ఆటోలో బయల్దేరగా ఏటూరునాగారం శివారు హైవే స్ట్రీట్ వద్ద ఘోర ప్రమాదం జరిగింది. రోడ్డుకు అడ్డంగా ఉన్న గేదె కళేబరాన్ని తప్పించబోయిన ఆటో డ్రైవర్.. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొన్నాడు. దీంతో ఆటో డ్రైవర్ నాగరాజుతో పాటు సత్యనారాయణ, సత్యవతి దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. వారి కూతురు అనితతో పాటు ఆటోలో ఉన్న యువకుడు అంజిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వీరిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిత కూడా మృతి చెందింది. అనిత మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీ నుంచే ఆమె అత్తగారి ఊరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తొండంగి మండలం కోదాడకు ఆదివారం తరలించారు. సత్యనారాయణరాజు, సత్యవతి దంపతులకు ఏకైక సంతానం అనిత. ఆమెకు కుమారుడు, కూతురు ఉన్నారు. గత ఏడాది కూతురి వివాహం చేశారు. అనిత భర్త సాగి సత్యనారాయణరాజు ఇటీవల అనారోగ్య బారిన పడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు.

పోటెత్తుతున్న వరదనీరు


(పైన) వరద ప్రవాహం పెరుగుతున్న దృశ్యం

గండిపోశమ్మ ఆలయంలోకి వరద నీరు

దేవీపట్నం, జూలై 14: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు వరదనీరు గోదావరికి వచ్చి చేరింది. దీంతో మండలంలో ముంపు గ్రామాలు గత రెండు రోజులు క్రితమే నీట మునిగాయి. గోదావరి ఉధృతి మరింత పెరగడంతో పోశమ్మ గండి వద్ద వరదనీరు పెరిగి ఆదివారం మధ్యాహ్నం అమ్మవారి ఆలయాన్ని చుట్టుముట్టింది. ఇదే వరద సోమవారం కొనసాగినట్లయితే అమ్మవారి ఆలయంలోకి వరద నీరు చేరి దర్శనాలకు బ్రేక్ పడనుంది. రెండు రోజుల క్రితం దండంగి వద్ద ఉన్న సీతపల్లి వాగుకు వరదనీరు చేరడంతో ప్రభుత్వ క్యాంప్ కార్యాలయాలకు గండిపై ఉన్న నాలుగు పంచాయతీలకు సంబంధాలు తెగిపోయాయి.

ఆలోచింపజేసిన నాటికలు


క్షేత్రం నాటికలోని ఓ సన్నివేశం

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 14: అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా ప్రదర్శించిన క్షేత్రం నాటిక అందరినీ ఆకట్టుకుంది. కాకినాడ సూర్యకళా మందిరంలో నాలుగో రోజు కార్యక్రమాలను ఎస్ఆర్‌టీ ఇంజనీర్స్ ఎండీ బీఆర్ ప్రసాదరెడ్డి ఆదివారం రాత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆడపిల్లలపై జరుగుతున్న వివక్షతను రూపుమాపాలని కోరుతూ గుంటూరు ఆరాధన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన క్షేత్రం నాటిక ప్రతిఒక్కరినీ ఆలోచింపజేసింది. ఆకురాతి శిల్ప ఈ నాటిక రచన చేయగా జి.మనోహర్ దర్శకత్వం వహించారు. తొలుత గుంటూరు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ ఆధ్వర్యంలో నాలోన నీవే నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళా పరిషత్ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అచ్యుతరామిరెడ్డి, పంపన దయానందబాబు, ఉపాధ్యక్షుడు ఎస్వీ ఆర్ బాపిరాజు, ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ కార్యదర్శి నాదెండ్ల ప్రభుదాసు పాల్గొన్నారు.

78 వేల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 14:ధవళేశ్వరం వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ నుంచి 78,209 క్యూసెక్కులు మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.30 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 3 వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1200 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

నేటి నుంచి అన్నవరం రైల్వేగేటు మూసివేత

అన్నవరం, జూలై 14: అన్నవరం రైల్వేగేటును సోమవారం ఉదయం 7గంటల నుంచి గురువారం సాయంత్రం 5గంటల వరకు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గేటులో సాంకేతిక సమస్యలు ఉండడంతో మరమ్మతులలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్నవరం నుంచి ఒంటిమామిడి, తొండంగి, కొత్తపల్లి వెళ్లే ప్రయాణికులు గమనించి చిన్నాయపాలెం, రావికంపాడు మీదుగా రాకపోకలు కొనసాగించుకోవాలని కోరారు.

డయేరియా సోకి తగ్గిన వ్యక్తి మృతి

సీతానగరం, జూలై 14: డయేరియా సోకి తగ్గిన వ్యక్తి ఇంటి వద్ద చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండల కేంద్రమైన సీతానగరం గ్రామానికి చెందిన పెంటా సుబ్బారావు ఆదివారం సాయంత్రం సుమారు 4 గంటల ప్రాంతంలో మృతిచెందాడు. సీతానగరం పీహెచ్‌సీ డా.చైతన్య విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 2న డయేరియాతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందగా మూడు రోజులలో డయేరియా నుంచి పూర్తిగా కోలుకున్నాడని, ఈ నెల 6న ఆయాసం రావడంతో మూత్రం బంద్ కావడంతో కుటుంబ సభ్యులు సీతానగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 10న సుబ్బారావు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారని ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేయాలని ఆసుపత్రి వర్గాలు చెప్పడంతో కుటుంబ సభ్యులు తిరస్కరించి ఇంటికి తీసుకువచ్చారని అన్నారు. అప్పటి నుంచి ఇంటి వద్దనే వైద్య సేవలు అందిస్తున్నామని, ఈయనకు మూత్ర పిండాలు పనిచేయకపోవడంతో ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు

భారీ కొండచిలువ హతం



జగ్గంపేట రూరల్,జూలై14: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని జె.కొత్తూరు గ్రామ శివారున రాజు పొలంలో జె. కొత్తూరు గ్రామస్తులు పనిచేస్తుండగా కొండచిలువ కనిపించింది. భయభ్రాంతులకు గురైన వెంటనే సమీప పొలంలో పని చేస్తున్న వారిని పిలిచి హతమార్చారు. ఇప్పటి వరకు ఇటువంటి కొండ చిలువను ఎప్పుడూ చూడలేదని రైతులు చెబుతున్నారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

పెద్దాపురం, జూలై 14: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక రాజుగారి వీధిలో ఉన్న ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయిలో నిర్వహించడం జరుగుతుందని ఆర్డీవో జె.సీతారామారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.రామ్‌సుందర్‌రెడ్డి హాజరవుతారని, అర్జీదారులు తమ సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు.

ఈ రహదారులపై నడిచేదెలా?

- అధ్వానంగా గొల్లప్రోలు జగనన్న కాలనీ రోడ్లు
- పట్టించుకోని అధికారులు
- ఏమాత్రం ఆదమరిచినా జారడమే



గొల్లప్రోలు పట్టణ శివారులో జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారులు



గొల్లప్రోలు, జూలై 14: కనీసం మనిషి నడిచేందుకు వీలులేని రహదారులు. బురదమయంగా మారిన ఆ రోడ్లపై బురదలోనే నడుచుకుని వెళ్లాల్సిందే. ఏ మాత్రం ఆదమరిచినా జారిపోవడమే. ఆ పై గోతులు రాత్రయితే ఇంటికి చేరేవరకూ భయం.భయమే.

గొల్లప్రోలు పట్టణ శివారులో వైసీపీ ప్రభుత్వ హయాంలో నూతనంగా మంజూరు చేసిన జగనన్న కాలనీలో రహదారులు అధ్వానంగా మారాయి. స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించుకునే వరకూ లబ్ధిదారులపై ఒత్తిడి తెచ్చిన నాటి పాలకులు, అధికారులు ఇక్కడ కనీస సదుపాయాలు కల్పించడాన్ని విస్మరించారు. కాలనీలో ఏ ప్రాంతంలోనూ సరైన రోడ్లు లేవు. కేవలం గ్రావెల్ రోడ్లు నిర్మించి చేతులు దులుపేసుకున్నారు. ఎక్కడా ఒక్క డ్రెయిన్ కూడా నిర్మించలేదు. దీంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ అధ్వానంగా మారి దీనిపై నడిచే ప్రజలు జారిపోతున్నారు. కనీసం నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితిలో ఉన్న ఈ రహదారులు అక్కడ కాలనీ ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపుతున్నాయి. నడిచేవెళ్లే వారే కాకుండా ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. కాలనీలోకి వచ్చే రోడ్డు కూడా ప్రమాదకరంగా మారిందని కాలనీవాసులు తెలిపారు. గ్రావెల్ రోడ్లు నిర్మించి ఆ తర్వాత వాటిని అభివృద్ధి చేసే పనులను విస్మరించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రధాన రహదారులనైనా సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదని మండిపడుతున్నారు. ఇప్పుడైనా అధికారులు కాలనీలో ప్రజల ఇబ్బందులపై దృష్టి పెట్టి రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధికి చర్యలు చేసుకోవాలని వారు కోరుతున్నారు.

రహదారులు జలమయం

ఏలేశ్వరం, జూలై 14: పట్టణంలో ఆదివారం కురిసిన వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం ఏ ఒక్క రోడ్డుకు డ్రైనేజీలు, మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏ రోడ్డు చూసినా పెద్ద పెద్ద గుంతలతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వర్షపు నీరు పోయే మార్గం లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే రహదారులపై గుంతల్లో నిలిచిపోతుంది. నగర పంచాయితీ పరిధిలో సీసీరోడ్లు అభివృద్ధి చేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో చినుకు పడితే బురద నీరు చేరడంతో బాటసారులకు అవస్థలు తప్పడంలేదు. ఇకనైనా గుంతలు పూడ్చి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు వాపోతున్నారు.



ఏలేశ్వరం షిర్డీనగర్‌లో గుంతల్లోకి చేరిన వర్షపు నీరు

చినుకు పడితే చిత్తడే

రౌతులపూడి, జూలై 14: రౌతులపూడిలో ప్రధాన రహదారి దుర్గాదేవి ఆలయం నుంచి మార్కెట్ వరకూ అధ్వానంగా ఉంది. ప్రస్తుతం కురిసిన వర్షాలకు నీరు రహదారిపైనే ఉంటుంది. చిన్నపాటి చినుకులకే చిత్తడిగా మారుతుంది. రహదారి బురదమయంగా ఉండడంతో ప్రయాణికులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రం కావడంతో వివిధ పనులపై చుట్టుపక్కలగ్రామాల వారు రౌతులపూడి వస్తుంటారు. అయితే సినిమాసెంటర్‌కు వచ్చేసరికి ఇబ్బందులు తప్పడంలేదు. హైస్కూల్, దుర్గాదేవి ఆలయం, ప్రధాన మార్కెట్, రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. నీరు పోయేందుకు డ్రైనేజీ నిర్మించినప్పటికీ డ్రైను ముందు షాపు యాజమానులు మట్టిని వేసి ఎత్తు చేయడంతో డ్రైనేజీలోకి నీరు వెళ్లడం లేదు. దీంతో రహదారిపైనే నీరు నిల్వఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీ ముందు మట్టిని తొలగించి రహదారిపై నీరు పోయే మార్గం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



రౌతులపూడిలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

నా డైరీ కనిపించడం లేదు పుస్తకావిష్కరణ



నా డైరీ కనిపించడం లేదు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పెద్దాపురం, జూలై 14: మానవ సంస్కారాన్ని పెంచే కవిత్వంగా నా డైరీ కనిపించడం లేదు కవితా సంపుటి నిలుస్తుందని పలువురు వక్తలు అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో సీహెచ్ మంజుల రచించిన నా డైరీ కనిపించడం లేదు పుస్తకావిష్కరణ సభ ఆదివారం సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జ్యోశ్యుల కృష్ణబాబు అధ్యక్షతన నిర్వహించారు. కవితా సంపుటిని విశ్రాంత ఉపాధ్యాయుడు చిరిగిన సూర్యారావు ఆవిష్కరించారు. కవితా సంకలనాన్ని సాహితీ స్రవంతి సభ్యురాలు మిరియాల జయశ్రీ సమీక్ష చేస్తూ ప్రసంగించారు. ప్రకృతి, తెలుగు గ్రామీణ సంస్కృతి, రోజువారీ జీవిత సమస్యలను సామాజిక స్పృహతో చక్కటి కవితలుగా ఈ సంపుటిలో వివరించారన్నారు. 45 కవితలతో ఈ పుస్తకాన్ని ప్రచురించడం చాలా సంతోషంగా ఉందని రచయిత అన్నారు. రచయితను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరవర్మ, సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు గనారా, అనంతరావు, చల్లా విశ్వనాథం, రొంగల వీర్రాజు, కొత్త శివ, వంగలపూడి శివకృష్ణ, యెండ్రు రామారావు, పూడి శ్రీనివాస్, ఉప్పిటి రవి, అరుణ, కృష్ణ, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అనితరుడు పుస్తక పరిచయసభ

పోర్టుసిటీ (కాకినాడ), జూలై 14: సహృదయ సాహితీ సంస్థ, పీఆర్ ప్రభుత్వ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో అనితరుడు అనే పుస్తక పరిచయ సభ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పీఆర్ కళాశాల ఎల్‌సీడీ హాల్ డాక్టర్ అవంత్స సోమసుందర్ ప్రాంగణంలో మువ్వా శ్రీనివాసరావు రచించిన అనితరుడు కవితాంతరంగ విశ్లేషణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం హాజరవుతారని, డాక్టర్ వేదుల శ్రీరామశర్మ(శిరీష) అధ్యక్షత వహిస్తారని, ముఖ్యవక్తగా డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథులుగా జేఎన్‌టీయూకే డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్‌వీజీ మురళీకృష్ణ, తెలుగు, సంస్కృత శాఖాధిపతి డాక్టర్ వై.బుజ్జి హాజరవుతారని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కవులు, సాహితీవేత్తలు విచ్చేస్తారని పేర్కొన్నారు.

నేడు మత్తు పదార్థాల నివారణపై అవగాహన సదస్సు

ప్రత్తిపాడు, జూలై 14: ధర్మవరం జడ్పీ హైస్కూల్లో సోమవారం ఉదయం హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం, మద్యం, మత్తు పదార్థాల నివారణపై అవగాహన సదస్సు జరగనుంది. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ముఖ్య అతిథిగా సదస్సులో పాల్గొంటారు. ఇటీవల యువత ఆన్‌లైన్ బెట్టింగ్, మత్తుపదార్థాలకు బానిసలుగా మారుతున్న నేపథ్యంలో యువతను వాటి నుంచి కాపాడేందుకు కార్యక్రమం చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. అలాగే గ్రామంలో మండలంలోని వివిధ హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

తుని రూరల్, జూలై 14: రోటరీ క్లబ్ తొలి సెంట్రల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం తుని లయోలా స్కూల్ ఆవరణలో ఆదివారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రోటరీ డిస్ట్రిక్ 3020 గవర్నర్ డాక్టర్ ఏలూరి కల్యాణ చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షుడిగా చెక్కా శ్రీధర్, కార్యదర్శిగా దండెం కృష్ణ, కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా చేరిన వంగలపూడి దొరబాబు, గరగ సుబ్బారావు, ఎం.వెంకటేశ్వరరావు, గొల్లపల్లి నూకరాజు, డాక్టర్ భగవాన్‌లకు పిన్‌లు బహూకరించి ఆహ్వానించారు. అసిస్టెంట్ గవర్నర్ ఎస్.పద్మావతి, ప్రతినిధులు దండెం రామకృష్ణ, కంకిపాటి జమీన్, మురళీరాజేష్, మాణిక్యాలరావు, అప్పలరాజు, పి.కిషోర్ ఉన్నారు.

కొనసాగిన ఆక్రమణల తొలగింపు



పిఠాపురం కుంతీమాధవ స్వామి ఆలయం వద్ద ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

పిఠాపురం, జూలై 14: పట్టణంలోని కుంతీమాధవస్వామి దేవస్థానం వద్ద ఆక్రమణల తొలగింపు రెండోరోజు కొనసాగింది. ఆలయ ఉత్తర ద్వారం వద్ద ఆక్రమణలపై భక్తులు, పరిసర ప్రాంత ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు శనివారం వాటిని మున్సిపల్ అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే. అయితే ఆక్రమణల తొలగింపు పూర్తిస్థాయిలో చేయకపోవడంపై భక్తులు నుంచి నిరసన వ్యక్తమయింది. ఈ నేపథ్యంలో ఆదివారం మిగిలిన ఆక్రమణల తొలగింపు చేపట్టారు. తొలగించిన తర్వాత ఆ ప్రాంతాన్ని పూర్తిగా చదును చేశారు. ఆక్రమణల తొలగింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

కరప, జూలై 14: కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు విచ్చేశారు. ఎక్కడెక్కడో ఉన్న 70మంది ఒక్కచోటకు చేరుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాలకు సేవాకార్యక్రమాలు చేయాలని తీర్మానించారు. ఈ బ్యాచ్‌కు చెందిన జిల్లా విద్యాశాఖాధికారిణి రావుల గంగాభవానీతో బాటు పూర్వపు విద్యార్థులు గొర్రెల కామేశ్వరరావు, మిరియాల నరసింహరావు, మేడిశెట్టి మురళి, గంధం పెదబాబు, సతీష్, పెద్దిరెడ్డి గోవిందరాజు, రామ్మోహన్, త్రిమూర్తులు, పాట్నీడి అప్పారావు, రెడ్డి గోవిందు, మంచాల శ్రీను, భైరవమూర్తి, పుట్టా వీరప్రసాద్‌గాంధీ పాల్గొన్నారు.



కరపలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మరమ్మతులు ఎప్పుడు?

ప్రత్తిపాడు, జూలై 14: ధర్మవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని గల కాలనీలు తాగునీటి చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో కాలనీ వాసులు వారం రోజులుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఈ కాలనీలో 4 హ్యాండ్ బోర్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో 3 పంపులు మరమ్మతుల బారినపడ్డాయి. వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు అధికారుల్ని కోరుతున్నారు.



హైస్కూల్ సమీపంలో మరమ్మతులకు గురైన పంపు

మొక్కులు తీర్చుకున్న నాయకులు



ఏలేశ్వరంలో మొక్కులు తీర్చుకున్న నాయకులు

ఏలేశ్వరం, జూలై 14: ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా వరుపుల సత్యప్రభ గెలవాలని ఎన్నికల ముందు పట్టణంలో కనక దుర్గమ్మ తల్లికి కూటమి నాయకులు మొక్కుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం స్థానిక 20వ వార్డులో కనక దుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి 101 కొబ్బరికాయలు కొట్టి చీర, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, కోనాల వెంకటరమణ, టీడీపీ కార్యకర్తలు ఉప్పు సతీష్, వాగు రాజేష్, సామంతుల గోపాలకృష్ణ, నీలి త్రిమూర్తులు, సామంతుల రాంబాబు, జొన్నాడ వీరబాబబు, శశి స్వామి, దొంతాల అప్పారావు, డి.గంగరావు, అనంతరపు రాజు పాల్గొన్నారు.


మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



గొల్లప్రోలులో మొక్కలు నాటుతున్న నాయకులు

గొల్లప్రోలు, జూలై 14: సామాజిక సేవతో పాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు భాగస్వాములు అవుతామని బీజేపీ నాయకులు తెలిపారు. గొల్లప్రోలులో వారు ఆదివారం పలు చోట్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుడు గుండ్ర శ్రీను, నాయకులు దంగేటి దొరయ్య, అల్లుబోయిన సూరిబాబు, అడబాల వీరమోహన్, కర్నీడి తాతీలు, పవన్‌కుమార్, రమణ, వానపల్లి రమణ, కంబాల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా దుర్గాష్టమి పూజలు



విశేష పూజల్లో మహిషాసురమర్దని

సామర్లకోట, జూలై 14: దుర్గాష్టమి మహాపర్వదినం సందర్భంగా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం ఆవరణలో ఉన్న మహిషాసురమర్దని అమ్మవారి ఉపాలయం వద్ద ఆదివారం దుర్గాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్‌ల వేదమంత్రోచ్ఛారణల మధ్య మహిషాసురమర్ధని అమ్మవారికి విశేష అభిషేక, పుష్పార్చన పూజలు చేశారు. నూతన పట్టు వస్త్రాలతో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించారు.

వైభవంగా సత్తెమ్మతల్లి జాతర



పెదశంకర్లపూడి జాతరలో శక్తివేషాలు

ప్రత్తిపాడు, జూలై 14: మండలంలోని పెదశంకర్లపూడిలో ఆదివారం సత్తెమ్మతల్లి జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామదేవతగా కొలువైన అమ్మవారికి ఆషాడమాసంలో సంప్రదాయబద్ధంగా జాతర మహోత్సవాన్ని నిర్వహించి గ్రామస్తులు మొక్కులు చెల్లించారు. ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు, ఉపాహారాలులలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో కళాకారుల శక్తివేషాలు,డప్పుల డ్యాన్స్‌లు విశేషంగా ఆకట్టుకున్నాయి.

'తనుకురాజు సేవలు మరువలేనివి'

తాళ్లరేవు, జూలై 14: కార్మికనేత మందనక్క తనుకురాజు సేవలు మరువలేనివని సీపీఎం నేత కమిడి సత్యశ్రీనివాస్ అన్నారు. ఆదివారం తాళ్లరేవులో ప్రజాసంఘాల కార్యాలయంలో కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన తనకురాజు సంస్మరణసభ జరిగింది. తనుకురాజు చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి సేవలను ప్రశంసించారు. కార్మిక, ప్రజాసంఘాల నేతలు ఉన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

కొరవడిన విద్యుత్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ



సామర్లకోట ఎఫ్‌సీఐ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తుప్పలు

సామర్లకోట, జూలై 14: సామర్లకోట విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు స్థానిక విద్యుత్ అధికారులు పూర్తిగా తిలోదకాలిచ్చారు. ఏ కొద్దిపాటి వర్షం కురిసినా విద్యుత్ సరఫరా గంటల తరబడి అంతరాయం ఏర్పడుతుంది. ఒక వేళ విద్యుత్ సరఫరా ఉన్నా వోల్టేజీ హెచ్చుతగ్గులు, లోవోల్టేజీ, హైవోల్టేజీ ఏర్పడి విద్యుత్ ఉపకరణాలు దగ్ధం అవుతున్నా అధికారులకు ఎక్కడా చీమకుట్టినట్లు ఉండడం లేదనన్న ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్ స్తంభాలపై చెల్ల కొమ్మలు తొలగించేందుకు ప్రతీవారం ట్రీకటింగ్ పేరిట గంటల తరబడి విద్యుత్ నిలిపివేస్తున్నా ఎక్కడ ట్రీకటింగ్ చేశారో ఎవరికీ తెలియదు. ఎక్కడి చెట్ల కొమ్మలు అక్కడే, ఎక్కడ తీగలపై పొదులు అక్కడే చందాన పలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రత్యక్షమవుతాయి. జిల్లా విద్యుత్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడి అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా మారిందన్న ఆరోపణలు అనేకం ఉన్నాయి. సత్యనారాయణపురం ఏడీబీ రోడ్డు కూడలి ప్రాంతం నుంచి ఎఫ్‌సీఐ వెళ్ళే రోడ్డులో మినీ వేన్ స్టాండ్ వద్ద డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్, ఏబీ.స్విచ్, విద్యుత్ స్తంభం, తీగెల చుట్టూ పెద్దఎత్తున పొదులు, తుప్పలు పెరిగి ప్రమాదభరితంగా మారాయి. వర్షం కురిసినపుడు ఆ పొదుల మీదుగా విద్యుత్ ప్రవహించి ఆ దారిన వెళ్లే వారికి విద్యుత్‌ఘాత ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సామర్లకోట పెద్దాపురం రోడ్డులో ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా గల డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తుప్పలు, పొదలు పెరిగి పోవడమే గాక పొదులు పెరిగి విద్యుత్ స్తంభాన్ని అల్లుకుని ఏకంగా విద్యుత్ తీగెలను తాకింది. దీంతో ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు నిత్యం రాకపోకలు సాగించే ఖాతాదారులు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఇలాంటి ట్రాన్స్‌ఫార్మర్ల బారిన పడి పలు మూగ జీవాల ప్రాణాలు గాలిలో కలిసిపోగా రానున్న కాలంలో మరిన్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సత్యనారాయణపురం వెనక రోడ్డులో విద్యుత్ తీగెలపై పొదులు

స్కాలర్‌షిప్‌ల పంపిణీ అభినందనీయం

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి



స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కాకినాడ రూరల్, జూలై14: కాకినాడ పరిసర ప్రాంతాల్లో ప్రతిభ గల పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రెడ్ కాన్వెంట్ విద్యార్థుల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేయడం అభినందనీయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. కాకినాడ ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో గల బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ప్రాంగణంలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు అందజేశారు. దీనికి ట్రస్ట్ అధ్యక్షుడు ఎస్.పాపారావు అధ్యక్షత వహించగా రూ.3లక్షల 33వేల స్కాలర్‌షిప్‌చెక్‌లను 17 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ బాదంబాలకృష్ణ, కార్యదర్శి జగన్నాధరావు, కళ్యాణి, శేషగిరిరావు, శ్రీనివాసరాజు ఉన్నారు.

'ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి'

తాళ్లరేవు, జూలై 14: మండల కేంద్రంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు రిలయన్స్, ఓఎన్‌జీసీ ఆయిల్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి చేయనున్నట్టు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. ఆదివారం తాళ్లరేవు మండలంలో అన్నివర్గాలకు చెందిన నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక టీడీపీ నేతలు ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగసూర్యనారాయణ, నడింపల్లి వినోద్, వాడ్రేవు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన గొల్లప్రోలు జనసైనికులు

ప్రాజెక్టు వాలంటీర్లకు శిక్షణ

గొల్లప్రోలు, జూలై 14: శాస్త్రీయ పద్ధతుల్లో ఘన, ద్రవ్య పదార్థాల నిర్వహణకు సంబంధించి రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా పిఠాపురం నియోజకవర్గంలో చేపట్టనున్న ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్టులో వాలంటీర్లుగా గొల్లప్రోలుకి చెందిన జనసైనికులు, యువకులు శిక్షణ పొందారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛాంధ్రప్రదేశ్, ఎస్ఎల్ఆర్ఎం టీమ్ సభ్యులు వీరికి ట్రైనర్స్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 2రోజులు పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పొందిన మర్రి చిన్న, జి.బుజ్జి, మొగలి రాజా, ఊట్కూరి లక్ష్మణస్వామి, అనిశెట్టి సూరిబాబు, జ్యోతుల రమేష్‌లను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులు అభినందించారు.

'ముళ్ళపొదలు తొలగించాలి'



రహదారి మధ్యకు వచ్చిన ముళ్ళపొద

తొండంగి, జూలై 14: ఏ.కొత్తపల్లి-కొమ్మనాపల్లి మధ్య నిర్మించిన రహదారికి ఇరువైపులా చిట్టడివి మాదిరి ముళ్ళ తుప్పలు మొలచినా వీటిని తొలగించే నాథుడు కరువయ్యాడు. రహదారి మధ్యవరకూ పెరిగిన కంచినార తుప్పలతో రహదారి మొత్తం మూతబడింది. పిల్లల బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తుండడం వల్ల వారి కంటికు గుచ్చుకుని కళ్లు పోయే ప్రమాదం ఉందని పిల్లల తల్లి దండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణం స్పందించి తుప్పలు ముళ్ళపొదలు తొలగించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో పల్లవి ప్రతిభ



ప్రతిభ కనబరిచిన పల్లవి

పెద్దాపురం, జూలై 14: కర్నూల్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈనెల 13,14 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో మండల పరిధిలోని ఆర్‌బీ పట్నం గ్రామానికి చెందిన మన్యం పల్లవి రెండు తృతీయ బహుమతులు సాధించింది. సబ్ జూనియర్ కేటగిరీలో 50, 100 మీటర్లు బటర్‌ఫ్లై స్ట్రోక్స్ ఈవెంట్‌లో ప్రతిభను కనభరిచింది. సుమారు 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని కోచ్ అప్పలనాయుడు తెలిపారు. పల్లవిని పలువురు అభినందించారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక



మనోహర్

సామర్లకోట, జూలై 14: జూనియర్ ఇండియా కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు సామర్లకోట ఎస్‌బీఎస్ఆర్‌సీ కబడ్డీ క్లబ్‌కు చెందిన కల్తూరి మనోహర్ ఎంపికైనట్టు రాష్ట్ర కబడీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, వై.శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన 70వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్, రాష్ట్ర కబడ్డీ చాంపియన్‌షిప్‌లో తూర్పు జట్టు విన్నర్స్‌గా నిలవగా పోటీల్లో మనోహర్ ప్రతిభ కనబర్చి జూనియర్ ఇండియా కబడ్డీ జట్టులో స్థానం సంపాదించాడన్నారు. దీంతో మనోహర్‌ను క్రీడాకారులు అభినందించారు.

పైపులైన్లకు మరమ్మతులు



జగ్గంపేట జూలై 14: పట్టణంలో గుర్రప్పాలెం రోడ్‌లో గల మంచినీటి ఓవర్ ట్యాంక్ నుంచి వచ్చే పైపులైన్లు ఒక్కసారిగా ఒకదాని తర్వాత ఒకటి మరమ్మతులకు గురికావడంతో పనులను సర్పంచ్, కార్యదర్శుల ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. వర్షం సైతం లెక్కచేయకుండా వేగవంతం చేశారు.